# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 303 | పేజీలు: 4 | వెల: రూ.4/- | సోమవారం 29 జూన్ 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




### బిఆర్ఎస్‌కు గతమే కానీ..

## భవిష్యత్తు లేదు

**కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారు: సీఎం రేవంత్ రెడ్డి**

**నల్గొండలో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన**

**తెలంగాణ సాధిస్తే ఆ త్యాగాన్ని టీఆర్ఎస్ వాళ్లు తమ ఖాతాలో వేసుకున్నారని విమర్శ .. మాజీ సీఎం కేసీఆర్‌పై ఆగ్రహం**

**నల్లగొండ , జూన్ 28 (నమస్తే ఉదయం)**

కాంగ్రెస్ ప్రజా పాలనకు నాలుగు కోట్ల ప్రజల ఆశీర్వాదం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ నల్లగొండ జిల్లాలో పర్యటించిన ఆయన సుమారు రూ.13 వేల కోట్లతో ఆర్ అండ్ బీ చేపట్టనున్న హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి శ్రీకారం చుట్టారు. నల్గొండ జిల్లా కనగల్ వేదికగా హ్యామ్ రోడ్ల పైలాన్‌ను సీఎం ఆవిష్కరించారు. అదేవిధంగా నల్గొండ కార్పొరేషన్‌లో తొలిదశ తాగునీటి ప్రాజెక్టు పనులకు, రూ.83 కోట్లతో తొలిదశ తాగునీటి శుద్ధి కేంద్రం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఎన్‌జీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నాడు తెలంగాణ కోసం మంత్రి పదవిని ..మిగతా 2లో

## ప్రతీ వర్షపు నీటి బొట్టును

# పరిరక్షించాలి

**ఒడిసి పట్టుకోవడం సమిష్టి బాధ్యత**

**క్యాచ్ ది రెయిన్ మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ పిలుపు**

**హైదరాబాద్, జూన్ 28 (నమస్తే ఉదయం)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జల సంరక్షణకు పిలుపునిచ్చారు.. ప్రతి వర్షపు నీటి బొట్టును పరిరక్షించుకోవాలని మోదీ సూచించారు.. "క్యాచ్ ది రెయిన్" అనే ప్రచారాన్ని ఎక్కడా తక్కువ చేయవద్దని హితవు పలికారు. వర్షాకాలంలో నీటిని ఒడిసి పట్టుకోవడం సమిష్టి బాధ్యత అని మన్ కీ బాత్‌లో వివరించారు. ప్రధానమంత్రి మోదీ ఆదివారం తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 135వ ఎపిసోడ్‌లో ప్రసంగించారు. తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్'లో జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ముఖ్యంగా జాతీయ భద్రత, స్వావలంబన రంగాలలో 2026 మొదటి అర్ధభాగం ప్రతి భారతీయుడిని గర్వంతో నింపే అనేక విజయాలతో నిండి ఉందని ప్రధానమంత్రి అన్నారు. 2026వ సంవత్సరం సగభాగం ముగింపు దశకు చేరుకుంటోంది. ఈ ఆరు నెలల్లో, 'మన్ కీ బాత్'లో మన దేశస్థులు సాధించిన ఎన్నో విజయాల గురించి మనం చర్చించుకున్నాం. జూన్‌లో కూడా, దేశం కొన్ని విజయాలను సాధించింది, అవి ప్రతి పౌరుడిని గర్వంతో నింపుతున్నాయి. ఈ విజయాలు దేశ భద్రత, స్వావలంబనలకు సంబంధించినవి," అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తన ఇటీవలి కోల్‌కతా పర్యటనను గుర్తుచేసుకుంటూ, ఐఎన్ఎస్ దునగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రయ్‌లను భారత నౌకాదళంలోకి ప్రవేశపెట్టిన ఒక నౌకాదళ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం తనకు లభించిందని ప్రధాని మోదీ అన్నారు. భారతదేశం పెరుగుతున్న రక్షణ తయారీ సామర్థ్యాలను నొక్కిచెబుతూ.. "ఈ నౌకల రూపకల్పన నుండి తయారీ వరకు ప్రతీదీ స్వదేశీ అని" ఆయన అన్నారు. జూన్ నెలలో రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ స్వదేశీ పరిజ్ఞానంతో నిర్వహించిన సుదూర భూతల దాడి క్రూయిజ్ క్షిపణి పరీక్షను ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, దీనిని భారతదేశ రక్షణ రంగానికి మరో ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. భారతదేశంలో తయారైన సి-295 రవాణా విమానం తొలి ప్రయాణంతో దేశం విమానయాన రంగంలో ఒక పెద్ద విజయాన్ని సాధించిందని ఆయన ఇంకా అన్నారు. "సి-295 విమానం 'మేడ్ ఇన్ ఇండియా'. ఇది తన తొలి ప్రయాణాన్ని పూర్తి చేసింది. ఇలాంటి 40 విమానాలు ఇక్కడే భారతదేశంలో తయారవుతున్నాయి," అని ప్రధానమంత్రి అన్నారు. పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం దృష్ట్యా తాను చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించినందుకు ప్రధాని మోదీ పౌరులకు ..మిగతా 2లో



## ఇడుపు కాయితం అర్థం పవన్‌కు తెలుసు

**తెలంగాణ భాషను హేళన చేయడం వల్లే ఉద్యమం**

**ఒకరు సంస్కృతిని మరొకరు గౌరవించుకోవాలి**

**కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ ఎస్ ల మౌనం సరికాదు**

**తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు**

**హైదరాబాద్, జూన్ 28 (నమస్తే ఉదయం)**

తెలంగాణ భాష, సంస్కృతిని కించపరిచేలా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ఇటీవల 'ఇడుపు కాయితం' అనే సినిమా పేరుపై జరుగుతున్న వివాదంపై స్పందించారు. ఇడుపు కాయితం అంటే తెలియదని కొందరు ట్రోలింగ్ చేస్తున్నారని.. ఈ పదం అర్థం తెలియని వారు ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవన్ కళ్యాణ్‌ను అడిగితే చెబుతారని అన్నారు. ఆయనకు ఈ పదం అర్థం బాగా తెలుసునంటూ ట్రోలర్స్ కు కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ భాషపై అవహేళన చేయడం వల్లే రాష్ట్రం కోసం ఉద్యమం వచ్చిందని ఆమె గుర్తు చేశారు. ఒకరి సంస్కృతిని మరొకరు పరస్పరం గౌరవించుకోవాలని ఆమె సూచించారు. తెలంగాణ భాషను కించపరుస్తున్నా కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు మౌనంగా ఉండటాన్ని ఆమె తప్పుబట్టారు. పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితాన్ని కవిత టచ్ చేయడంతో మరోసారి ఆయన ఫ్యాన్స్, జనసైనికులు కవిత వ్యాఖ్యలపై స్పందించే అవకాశం ఉంది. సినిమా టైటిల్ విషయంలోనూ పవన్‌ను టార్గెట్ చేయడంతో ఈ అంశం రాజకీయ వివాదంగా మారనుంది. ఇడుపు కాయితం మూవీ టైటిల్ ప్రకటన తరువాత సోషల్ మీడియాలో ఏపీ, తెలంగాణ నెటిజన్ల మధ్య కామెంట్స్ వార్ నడుస్తోంది.



## నేడు, రేపు భారీ వర్షాలు

**ఏపీ, తెలంగాణకు సూచన**

**గంటకు 50 నుంచి 60 కి.మీ వేగంతో గాలులు**

**22 రాష్ట్రాల్లో చురుగ్గా రుతుపవనాలు**



2



### సౌదీ అరేబియాలో కుప్పకూలిన

## హెలికాప్టర్

**ప్రమాదంలో 14 మంది సౌదీ పౌరులు మృతి**

**న్యూఢిల్లీ, జూన్ 28 (నమస్తే ఉదయం)**

సౌదీ అరేబియాలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. ప్రభుత్వ రంగ దిగ్గజ చమురు సంస్థ సౌదీ అరామ్కోకు చెందిన హెలికాప్టర్ కుప్పకూలడంతో అందులో ప్రయాణిస్తున్న 14 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మృతులంతా సౌదీ జాతీయులేనని సౌదీ ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. సౌదీ తూర్పు తీరంలోని రస్ తనూరా ప్రాంతంలో ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ విషయాన్ని ఇంధన మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు ధ్రువీకరించినట్లు సౌదీ ప్రెస్ ఏజెన్సీ తన కథనంలో పేర్కొంది. ప్రమాదంపై సౌదీ ప్రభుత్వం ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. అయితే, ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై సౌదీ అరామ్కో సంస్థ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. రస్ తనూరా ప్రాంతం సౌదీ ఇంధన రంగానికి అత్యంత కీలకం. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఎగుమతి టెర్మినల్స్‌లో ఒకటి ఇక్కడే ఉంది. ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా దాదాపు నాలుగు నెలల పాటు నిలిచిపోయిన కార్యకలాపాలు ..మిగతా 2లో

## నిందితుల ఇళ్లల్లో సోదాలు..!

**అయోధ్య రామాలయ విరాళాల స్కామ్ పై దాడులు**

**ఏక కాలంలో 8 మంది సభ్యుల లావాదేవీలపై ఆరా**

**రంగంలోకి ఆరు ప్రత్యేక పోలీసు బృందాలు**

**రూ. 5 నుంచి రూ. 7 కోట్ల కానుకల స్కామ్ పై విచారణ**

**న్యూఢిల్లీ, జూన్ 28 (నమస్తే ఉదయం)**



అయోధ్య రామాలయ విరాళాల సేకరణలో జరిగినట్లుగా చెప్తున్న అక్రమాల వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్న ఈ కేసులో విచారణను వేగవంతం చేసిన పోలీసులు.. ఆదివారం ఉదయం నిందితుల నివాసాలపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయి, జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఎనిమిది మంది నిందితుల ఇళ్లలో ఆరు ..మిగతా 2లో

**అబద్ధపు మాటలతో స్థాయిని**

## దిగజారుస్తున్న స్పీకర్

**కల్వకుంట్ల తారకరామారావు**

2

## మళ్లీ యుద్ధం అంచుకు పశ్చిమాసియా

**యూఎస్ స్థావరాలపై ఇరాన్ ఆపరేషన్**

**న్యూఢిల్లీ, జూన్ 28 (నమస్తే ఉదయం)**

పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ భయాలు మొదలయ్యాయి. అమెరికా-ఇరాన్ రెండురోజులుగా పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఇరాన్ క్షిపణి, డ్రోన్ నిల్వ కేంద్రాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు లక్ష్యంగా అమెరికా దాడి చేయగా.. అగ్రరాజ్య సైనిక స్థావరాలను ఇరాన్ టార్గెట్ చేసింది. కువైట్, ..మిగతా 2లో



# ప్రతీ వర్షపు నీటి బొట్టును పరిరక్షించాలి

**మొదటి పేజీ తరువాయి...**

ధన్యవాదాలు తెలిపారు. "నేను దేశ ప్రజలను కొన్ని విషయాలపై కోరాను. వీలైనంత వరకు కొంతకాలం పాటు బంగారం కొనుగోలుకు దూరంగా ఉండాలని ప్రజలను కోరాను" అని ప్రధానమంత్రి అన్నారు. ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ, పౌరులు తన విజ్ఞప్తికి మద్దతు ఇవ్వడమే కాకుండా పలు విధాలుగా చురుకుగా సహకరించారని మోదీ అన్నారు. "దేశంలోని ప్రతి పౌరుడికి నేను కృతజ్ఞుడను. వారు నా విజ్ఞప్తికి మద్దతు ఇవ్వడమే కాకుండా, అన్ని విధాలుగా చురుకుగా సహకరిస్తున్నారు. ఎన్నో కుటుంబాలు సందేశాల ద్వారా తమ అనుభవాలను నాతో పంచుకున్నాయి" అని అన్నారు. కార్‌పూలింగ్‌కు పెరుగుతున్న స్పందనను ప్రధాని హైలైట్ చేస్తూ.. ఒకే దిశలో ప్రయాణించే చాలా మంది వేర్వేరు కార్లను ఉపయోగించకుండా వాహనాలను పంచుకోవడం ప్రారంభించారని అన్నారు. "కార్‌పూలింగ్ గురించి ప్రజలు అనేక అనుభవాలను కూడా పంచుకున్నారు. ప్రతిరోజూ ఒకే దిశలో తమ సొంత వాహనాల్లో ప్రయాణించేవారు ఇప్పుడు కలిసి ప్రయాణించడం ప్రారంభించారు" అని మోదీ అన్నారు. భారతదేశంలో పుట్టినరోజులు, వివాహాలు, కుటుంబ వేడుకలు వంటివి కేవలం వ్యక్తిగత వేడుకలు మాత్రమే కాదని, అవి విస్తృత సమాజంతో పంచుకునే ఆనంద క్షణాలని ప్రధాని మోదీ అన్నారు. మహారాష్ట్ర చేపట్టిన ఒక విశిష్టమైన కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ,



ప్రధానమంత్రి నాందేడ్ జిల్లాలోని బహదూర్‌పురా గ్రామానికి చెందిన పేర్‌కర్ కుటుంబం ఉదాహరణను ఉదహరించారు. "మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన ఒక కుటుంబం తమ సంతోషాన్ని పంచుకోవడానికి చేసిన ఒక పని ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తమ ఆనందాన్ని పంచుకోవాలంటే, కష్టకాలంలో ఉన్న మరో కుటుంబానికి అండగా నిలిచేలాంటి సహాయాన్ని అందించాలని పేర్‌కర్ కుటుంబం భావించింది," అని ఆయన అన్నారు. తమ కుటుంబంలో జరిగే పెళ్లిళ్లలో సంప్రదాయబద్ధంగా బహుమతులు పంచడానికి బదులుగా, పేర్‌కర్ కుటుంబం సుమారు 3,500 మంది గ్రామస్తులకు ప్రమాద బీమాను ఏర్పాటు చేసిందని, దీని ద్వారా ప్రతి లబ్ధిదారునికి లక్ష రూపాయల బీమా కవరేజీ లభించిందని ఆయన అన్నారు. "ఈ చొరవ వెనుక ఉన్న భావన నిజంగా హృదయానికి హత్తుకునేలా ఉంది," అని ప్రధానమంత్రి అన్నారు. ప్రభుత్వం దేశవ్యాప్తంగా కోట్లాది కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పిస్తోందని, కేంద్రం సామాజిక భద్రతా పథకాలను కూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన గురించి ప్రస్తావిస్తూ, కేవలం రూ. 20 వార్షిక ప్రీమియంతో లబ్ధిదారులు రూ. 2 లక్షల వరకు ప్రమాద బీమా కవరేజీని పొందుతారని ఆయన అన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన గురించి కూడా ప్రధానమంత్రి మాట్లాడారు. ఈ పథకం కింద, బీమా చేయించుకున్న వ్యక్తి మరణించిన పక్షంలో కుటుంబాలకు రూ. 2 లక్షల బీమా కవరేజీ లభిస్తుంది. "దీని వార్షిక ప్రీమియం కేవలం రూ. 436 మాత్రమే, అంటే రోజుకు సుమారు రూ. 1.50 మాత్రమే. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా దాదాపు 11 లక్షల కుటుంబాలు సుమారు రూ. 22,000 కోట్ల సహాయాన్ని అందుకున్నాయి," అని ప్రధాని మోదీ అన్నారు.

# నేడు, రేపు భారీ వర్షాలు

## ఏపీ, తెలంగాణకు సూచన

## గంటకు 50 నుంచి 60 కి.మీ వేగంతో గాలులు

## 22 రాష్ట్రాల్లో చురుగ్గా రుతుపవనాలు

**హైదరాబాద్, జూన్ 28 (నమస్తే ఉదయం)**

భారతదేశవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల్లో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకవైపు నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా విస్తరిస్తుండగా.. మరోవైపు కొన్ని రాష్ట్రాల్లో ఎండ తీవ్రత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో రాబోయే రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 22 రాష్ట్రాల్లో రుతుపవనాలు చురుగ్గా కదిలిపోతున్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణలో ఐదు రోజుల పాటు వానలు కురవనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో సోమవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశం ఉంది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురవనున్నాయి. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించనుంది. 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీయనున్నాయి. దక్షిమ కోస్తా, రాయలసీమలో ఈ ప్రభావం ఉండనుంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం.. తెలంగాణలో నైరుతి రుతుపవనాల కదలికలు అత్యంత చురుగ్గా మారాయి. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రాబోయే ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయి. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో అతి



భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. జూన్ 28 నుండి జూలై 2 వరకు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, నల్గొండ, సూర్యాపేట, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లోనూ వానలు పడనున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలబడవద్దని అధికారులు హెచ్చరించారు. దేశంలోని ఇతర రాష్ట్రాల వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తే ఐఎండీ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. యూపీలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తున్నాయి. అయితే గతేడాదితో పోలిస్తే ఈసారి 9 రోజులు ఆలస్యంగా రుతుపవనాలు ఇక్కడికి చేరుకోవడం గమనార్హం. గత 16 రోజులుగా రుతుపవనాల కదలికల్లో స్తబ్దత ఏర్పడి, బిహార్ సరిహద్దుల వద్దే నిలిచిపోయాయి. దేశంలో విచిత్రమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. అస్సాం, మేఘాలయ, పశ్చిమ బెంగాల్, సిక్కిం, గోవా, కర్ణాటక, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో రాబోయే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఐఎండీ వీటికి కూడా ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. అదే సమయంలో.. రాజస్థాన్ సహా ఏడు రాష్ట్రాల్లో భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో గరిష్టంగా 43 డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే రెండు రోజులు తీవ్రమైన వడగాడ్పులు వీచే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరించింది.

# నిందితుల ఇళ్లలో సోదాలు..!

**మొదటి పేజీ తరువాయి...**

పోలీసు బృందాలు ఉదయం 7 గంటల నుంచే విస్తృత సోదాలు చేపట్టాయి. విచారణలో భాగంగా నిందితుల కుటుంబ సభ్యులను వారి ఆర్థిక లావాదేవీలు, అనుమానాస్పద కార్యకలాపాలపై అధికారులు ప్రశ్నించారు. అలాగే, నిందితుల కదలికలు, వారి వద్దకు వచ్చే వెళ్లే వ్యక్తుల వివరాలను తెలుసుకోవడానికి పోలీసులు పొరుగువారితో కూడా మాట్లాడారు. ఈ కుట్రలో మరికొంత మంది ప్రమేయం ఉందా అనే కోణంలో ఆధారాలను సేకరిస్తున్నారు. ఈ వివాదం తీవ్రరూపం దాల్చడంతో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా తమ పదవులకు రాజీనామా చేసినట్లు శనివారం ట్రస్ట్ ధృవీకరించింది. ఈ భారీ కుంభకోణం జూన్ 7వ తేదీన మొదటిసారి వెలుగులోకి వచ్చింది. భక్తులు సమర్పించిన విరాళాల నుంచి సుమారు 5 కోట్ల నుంచి 7.5 కోట్ల వరకు నిధులు దారిమళ్లాయని సమాజ్ వాదీ పార్టీ నాయకుడు తేజ్ నారాయణ్ 'పవన్' పాండే ఆరోపించారు. దీనిపై స్పందించిన ఆలయ ట్రస్ట్ విజ్ఞప్తి మేరకు జూన్ 13న రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ జూన్ 15 నుంచి 20 వరకు అయోధ్యలో ప్రాథమిక విచారణ జరిపి, నగదు, విలువైన వస్తువుల నిర్వహణలో అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించింది. ఆ తర్వాతే భారతీయ న్యాయ సంహిత, అవినీతి నిరోధక చట్టం కింద ఎనిమిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదైంది.

**నిందితుల వివరాలు ఇవే:**

పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో చంపత్ రాయ్‌కు అత్యంత ఆప్తుడైన రామ్ శంకర్ యాదవ్ అలియాస్ తిన్నుతో పాటు అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రమాశంకర్ మిశ్రా, మనీష్ యాదవ్, కరుణేష్ పాండే ఉన్నారు. వీరిలో అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రాలు బంధువులే కాకుండా, రాజీనామా చేసిన ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రాకు కూడా బంధువులు కావడం గమనార్హం. ఈ ఘటనలపై రామాలయ ట్రస్ట్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. దర్యాప్తు పారదర్శకంగా సాగేలా చూస్తామని భక్తులకు భరోసా ఇచ్చింది. "గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలు మమ్మల్ని తీవ్ర దిగ్భ్రాంతికి, గురిచేశాయి. భవిష్యత్తులో ఇలాంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటాం. ఆలయ పవిత్రతకు ఎలాంటి భంగం వాటిల్లలేదు. భక్తులు ఎలాంటి పుకార్లను, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు. ఇలాంటి ప్రయత్నాలు సనాతన ధర్మాన్ని కానీ, ఆలయాన్ని కానీ, కోట్ల మంది భక్తుల నమ్మకాన్ని కానీ ఏమాత్రం కదిలించలేవు" అని ట్రస్ట్ తన ప్రకటనలో పేర్కొంది.

# అబద్ధపు మాటలతో స్థాయిని దిగజారుస్తున్న స్పీకర్

**కల్వకుంట్ల తారకరామారావు**

**వికారాబాద్ జూన్ 28 (నమస్తే ఉదయం):**

రాజ్యాంగ బద్ధమైన స్థానంలో ఉండి ప్రజలను తప్పు త్రోవప్పటించే అబద్ధపు మాటలతో స్పీకర్ ప్రసాద్ కుమార్ స్థాయిని దిగజార్చుకుంటున్నాడని బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం వికారాబాద్ లో బీ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయనకు నాయకులు కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అంతేకాకుండా సీ ఎం, సీ ఎం అంటూ నినాదాలు చేస్తూ ఆయనను స్వాగతించారు. కార్యకర్తలు పెద్దఎత్తున ఒకే వద్దకు చేరడం నినాదాలు చేస్తూ ఆయనతో కరచాలనం చేయాలని కనీసం స్పర్శ నైనా తాకాలని కార్యకర్తలు అంగమా చేశారు. ఆంచనాకు మించి కార్యకర్తల వెల్లువతో కేటీఆర్ కళ్ళల్లో ఎనలేని సంతోషం పెల్లు బిగిసింది రెట్టింపు ఉత్సహంతో ఆయన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ గత ప్రభుత్వం పై చేస్తున్న తప్పుడు ఆరోపణలు ఆయన స్థాయిని దిగజార్చే విధంగా ఉండటం విచారకమని అన్నారు. తెలంగాణ ఆవిర్భావం నాడు 72 వేల కోట్ల అప్పుతో ఉన్న రాష్ట్రం ఉన్నదని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి పదేళ్లలో చేసిన అప్పు దాదాపు 3.80 కోట్ల రూపాయలని స్వయంగా కేంద్రభుత్వం నిర్ధారించిన లెక్కలని అన్నారు. ఉద్దేశపూర్వకంగా ఒక పార్లమెంట్ సభ్యుడు చేయించిన లెక్కల్లో చూపిన అప్పుని దాని కొండతలు చేసి స్పీకర్ ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి లు ప్రజలను తప్పు త్రోవ పట్టిస్తున్నారని ఆయన మండి పడ్డారు. ఏది ఏమైనా రాబోయేది బీ ఆర్ ఎస్ ప్రభుత్వమని పోలీసులు పెడుతున్న కేసులకు భయపడాల్సిన అవసరం లేదని ఎన్ని కేసులు బరిస్తే అంత పెద్ద నాయకుడావుతారని అన్నారు. పోలీసులు డ్యూటీ చెయ్యలని కానీ అతి చెయ్యకండని అన్నారు. వికారాబాద్ పోలీస్ అధికారులు డ్యూటీ చెయ్యండి కానీ అతి చెయ్యకండని ఆయన అన్నారు. అతి చేస్తే మాత్రం అన్ని గుర్తుపెట్టుకొని మిత్తితో సహా మీకు ఇచ్చే బాధ్యత నాదని అన్నారు. నేను వర్కింగ్ ప్రెసిడెంటుగా చెప్తున్నా మళ్ళీ బీ ఆర్ ఎస్ గవర్నమెంట్ వచ్చుడు పక్కా. 2028లో కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం పక్కని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ విషయం సీ ఎం రేవంత్ రెడ్డి గడ్డం ప్రసాద్ స్పీకర్ కి కూడా తెలుసని, అందుకే అందరు అందినకాడికి అన్నిస్కీంలు పెట్టుకొని, దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, నాగేందర్ గౌడ్, శుభప్రదపటేల్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.జంగిల్ రాజ్ నడుస్తోంది" అని బొత్స విమర్శించారు.



## బిఆర్ఎస్‌కు గతమే కాని..

# భవిష్యత్తు లేదు

**మొదటి పేజీ తరువాయి...**

త్యాగం చేసిన నాయకులు కొండా లక్ష్మణ్ బాపూజీ అని.. ఆయన తర్వాత మళ్లీ పదవీ త్యాగం చేసిన ఏకైక వ్యక్తి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అని అన్నారు.

**బీఆర్ఎస్ త్యాగం.. ఎలక్షన్, సెలక్షన్, కలెక్షన్..**

బీఆర్ఎస్ త్యాగం అంటే ఎలక్షన్, సెలక్షన్, కలెక్షన్ అని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. త్యాగం అంటే 1969లో పదవిని వదులుకున్న కొండ లక్ష్మణ్ బాపూజీది అని, మలి దశ ఉద్యమంలో పదవీ త్యాగం చేసింది కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిది అసలైన త్యాగమని తెలిపారు. వందల మంది త్యాగాలు చేసి తెలంగాణ సాధిస్తే.. ఆ త్యాగాన్ని టీఆర్ఎస్ వాళ్లు తమ ఖాతాలో నిస్సిగ్గుగా వేసుకున్నారని ధ్వజమెత్తారు. పెట్రోల్ పోసుకుని ప్రాణార్పణ చేసిన శ్రీకాంతా చారిని ఏమనాలని అన్నారు. ఏ పదవులు ఆశించకుండా ప్రాణాలర్పించిన వారివి త్యాగాలు కావా అని ప్రశ్నించారు. ఇక వంద రూపాయాల పెట్రోల్ మీద పోసుకున్న అగ్గిపెట్టెరావుది త్యాగం కాదని, వేల కోట్లు దోచుకున్నారంటూ పరోక్షంగా హరీశ్ రావుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో వందేళ్ల విధ్వంసం చేసింది కల్వకుంట్ల ఫ్యామిలీ అని కామెంట్ చేశారు. తోడేళ్లలా ఇద్దరు తెలంగాణలో తిరుగుతున్నారంటూ కేటీఆర్, హరీశ్ రావులను ఉద్దేశించి ఫైర్ అయ్యారు. ఏది ఏమైనా ప్రజా పాలనకు నాలుగు కోట్ల ప్రజల ఆశీర్వాదం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**పేదోళ్లకు ఇళ్లు కట్టిస్తుంటే ఓరుస్తలేరు..**

కల్వకుంట్ల కుటుంబ అవినీతిని చూసే ప్రజలు ఆ కుటుంబాన్ని శాశ్వతంగా బహిష్కరించారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మళ్లీ వారికి పదవులు ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా లేరని తెలిపారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తన మంత్రివర్గంలో ఒక్క మహిళకు కూడా చోటు ఇవ్వలేదని ఆరోపించారు. కానీ, తాము అధికారంలోకి వచ్చాక ఏటా రూ.16 వేల కోట్లు ఖర్చు చేస్తూ నిరుపేదలకు సన్నబియ్యం ఇస్తున్నాయని అన్నారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ పేదల గురించి పట్టించుకోలేదని.. వాళ్లు మాత్రం ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారని విమర్శించారు. ప్రతి గ్రామంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తుంటే బీఆర్ఎస్ వాళ్ల కడుపు మండుతోందని తెలిపారు. 30 నెలల్లోనే రైతులు ఖాతాల్లో రూ.1.56 లక్షల కోట్లు జమ చేసి అన్నదాతలను దన్నుగా నిలిచామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్‌కు గతమే కానీ భవిష్యత్తు లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆ పార్టీకి ఉప్పుపాతర వేశామని.. మళ్లీ మొక్క కూడా మొలవనీయ్యమని ప్రజలే అంటున్నారని కామెంట్ చేశారు. అధికారం పోయిన అక్కసుతో మూసీ కాలుష్యం కంటే కడుపులో విషం నింపుకున్నారని ఫైర్ అయ్యారు. అదేవిధంగా పదేళ్ల బీఆర్ఎస్ పాలన.. రెండున్నరేళ్ల తమ పాలనపై చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. స్పీకర్‌కు లేఖ రాయండి.. మేనిఫెస్టోలపై అడిగినన్ని రోజులు అసెంబ్లీ వేదికగా చర్చిద్దామని సీఎం సంచలన సవాలు విరిరారు. నేడు ఫామ్‌హౌస్‌లో ఉన్న కేసీఆర్ తింటున్న సన్న బియ్యమే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మా పేదలు తింటున్నారని తెలిపారు. అనుమానం ఉంటే కేటీఆర్ తండాలకు వెళ్లి చూసుకోవచ్చని అన్నారు. ఎస్ఎల్‌బీసీని పదేళ్లు పడావ్ పెట్టిన దుర్మార్గులు బీఆర్ఎస్ నేతలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తులసి వనంలో గంజాయి మొక్కలాగా సూర్యాపేటలో ఒక జానెడు ఉన్న వ్యక్తి మిగిలిండని.. వచ్చే ఎన్నికల్లో ఆయనను కూడా గెలవనియ్యబోమని సీఎం రేవంత్ రెడ్డి ఛాలెంజ్ చేశారు.

# మళ్లీ యుద్ధం అంచుకు పశ్చిమాసియా

**మొదటి పేజీ తరువాయి...**

బహ్రెయిన్‌లోని స్థావరాలపై నౌక, వైమానిక దళాలు మిస్సైల్, డ్రోన్ ఆపరేషన్ ప్రారంభించాయని ఐఆర్‌జీసీ ఆదివారం తెల్లవారుజామున ప్రకటించింది. రెండు దేశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాన్ని తొలుత ఇరాన్ ఉల్లంఘించిందని, కార్గో షిప్‌పై దాడులు చేసిందని అమెరికా ఆరోపించింది. దానికి ప్రతిస్పందనగానే ఇరాన్ స్థావరాలు, నిల్వ కేంద్రాలపై దాడులు చేశామని చెప్తోంది. అయితే కార్గో షిప్‌పై దాడిని అమెరికా ఒక సాకుగా చూపి, పశ్చిమా సియాలో పరిస్థితులను దిగజార్చుతోందని ఐఆర్‌జీసీ నిందిస్తోంది. కాల్పుల విరమణను అమెరికానే ఉల్లంఘిస్తోందని ఆరోపించింది. ఇదే కొనసాగితే.. పూర్తిస్థాయి ఒప్పందం కోసం జరుగుతోన్న దౌత్య ప్రయత్నాలు అన్నీ నిలిచిపోతాయని హెచ్చరించింది. ఎలాంటి దురాక్రమణకైనా తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని తన ప్రకటనలో పేర్కొంది.ఇరాన్ క్షిపణి, డ్రోన్ నిల్వ కేంద్రాలపై అమెరికా దాడులు చేసిన విషయాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్ వేదికగా వెల్లడించారు. "వారు మళ్లీ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో అమెరికా వైమానిక దళం దాడులు చేసింది. వారు ఎప్పటికీ నేర్చుకోకపోవచ్చు. అలాంటి పరిస్థితుల్లో విజయవంతంగా ప్రారంభించిన పనిని సైనిక పద్ధతిలో పూర్తి చేయాల్సి రావొచ్చు. అదే జరిగితే.. ఇరాన్ ఉనికే ప్రమాదంలో పడిపోతుంది" అని తీవ్ర హెచ్చరికలు చేశారు.

అరవై రోజుల్లో శాశ్వత శాంతి ఒప్పందాన్ని ఖరారు చేసుకునేలా అమెరికా-ఇరాన్ మధ్య ఇటీవల ఒప్పందం కుదిరింది. హార్మూజ్ జలసంధి మీదుగా నౌకల సురక్షిత ప్రయాణ హామీ, ఇరాన్ వద్ద ఉన్న శుద్ధిచేసిన యురేనియం నిల్వలు, ఆ దేశ అణుకార్యక్రమం వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు అమెరికా మధ్యవర్తిత్వంతో లెబనాన్-ఇజ్రాయెల్ మధ్య డీల్ కుదిరింది. ఇది ఇరాన్, హెజ్‌బొల్లా గ్రూప్‌నకు గట్టి ఎదురుదెబ్బ అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అభివర్ణించారు. అలాగే ఇప్పటికిప్పుడే తమ దళాలు దక్షిణ లెబనాన్‌ను వీడవని స్పష్టం చేశారు. లెబనాన్ విషయంలో ఇజ్రాయెల్ ఏమేరకు మాట మీద నిల్చుంటుందనేది అనుమానమే. ఏదో ఒకసాకు చూపి హెజ్‌బొల్లాపై దాడులు చేస్తుందనే భయాలు ఉన్నాయి. అవగాహన ఒప్పందం కుదిరినా.. ఈ కారణాలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయన్న నమ్మకం లేని పరిస్థితి నెలకొంది.

# సౌదీ అరేబియాలో కుప్పకూలిన హెలికాప్టర్

**మొదటి పేజీ తరువాయి...**

శుక్రవారమే ఇక్కడ తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజా ప్రమాదం జరగడం గమనార్హం. మృతుల కుటుంబాలకు ఇంధన మంత్రిత్వ శాఖ ప్రగాఢ సంతాపం తెలియజేసింది. దర్యాప్తు పూర్తయితే ప్రమాదానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.


**ఫ్రాన్స్‌లో కుప్పకూలిన విమానం..11 మంది మృతి**

ఫ్రాన్స్‌లోనూ ఇదే తరహా ప్రమాదం చోటు చేసుకుంది. స్కైడైవర్స్‌తో వెళ్తున్న చిన్నపాటి విమానం కూలిపోయి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. టామ్‌బ్లెయిన్ నగరంలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. పారాచూట్ జంపింగ్ కోసం ఔత్సాహికుల్ని తీసుకెళ్తున్న విమానం ప్రమాదవశాత్తు కూలిపోయింది. అందులో ఉన్నవారంతా మృత్యువాత పడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. సదరు సంస్థపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


# ఘనంగా సాయి చరణ్ రెడ్డి-కీర్తన రెడ్డిల రిసెప్షన్ వేడుక

## మైలార్ దేవుపల్లి దుర్గా కన్వెన్షన్ లో అంగరంగ వైభవంగా జరిగిన రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న పలువురు ప్రముఖులు






డాక్టర్ సాయి చరణ్ రెడ్డి - డాక్టర్ కీర్తన రెడ్డి రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య



డాక్టర్ సాయి చరణ్ రెడ్డి - డాక్టర్ కీర్తన రెడ్డి ల రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి, నాయకులు

**రాజేంద్రనగర్, జూన్ 28 (నమస్తే ఉదయం) :**

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు , విద్యుత్ కాంట్రాక్టర్, నమస్తే ఉదయం తెలుగు దినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్, రాజేంద్రనగర్ నియోజకవర్గం హైదర్ గూడ వాస్తవ్యులు మేకల దామోదర్ రెడ్డి , బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనిత రెడ్డిల కుమారుడు డాక్టర్ మేకల సాయి చరణ్ రెడ్డి, డాక్టర్ కీర్తన రెడ్డి ల రిసెప్షన్ వేడుక ఆదివారం మైలార్ దేవుపల్లి దుర్గా కన్వెన్షన్ లో అంగరంగ వైభవంగా జరిగింది. వీరిరువురి వివాహము గురువారం వరంగల్ లో జరిగిన సంగతి తెలిసిందే. వరంగల్ కు చెందిన పెండ్లి సంపత్ రెడ్డి, పెండ్లి సరళ ల కుమార్తె డాక్టర్ కీర్తన రెడ్డి ని డాక్టర్ ఎం సాయి చరణ్ రెడ్డి వివాహం చేసుకున్నాడు. దుర్గా కన్వెన్షన్ లో జరిగిన రిసెప్షన్ వేడుకలో ఇరు కుటుంబాల బంధువులు, స్నేహితులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ తో పాటు బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ లు తోకల శ్రీనివాస్ రెడ్డి, ఎం సంగీత, పి అర్చన జయప్రకాష్ తో పాటు పలువులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు అబ్దేశీ సదాలక్ష్మి, ప్రొఫెసర్




రిసెప్షన్ వేడుకలో కావేరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ వి ప్రవీణ్ రావు

జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, కావేరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ వి ప్రవీణ్ రావు, రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సల్లా సౌజన్య లు పాల్గొన్నారు. వీరితో పాటు నియోజకవర్గం కు చెందిన వివిధ పార్టీల నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు, టి ప్రేమదాస్ గౌడ్, అన్నపు రెడ్డి భీమార్జున్ రెడ్డి, అన్నపురెడ్డి స్వర్ణలత రెడ్డి, వై శ్రీధర్, ఎన్ మల్లారెడ్డి, ఎం కొమురయ్య, సర్ఫరాజ్ సిద్దిఖీ, కన్యాగారి నరసింహా రెడ్డి, ఎ మాధవ్ రెడ్డి, శీలం తిరుపతి రెడ్డి, కొలను సుభాష్ రెడ్డి, ఎస్ వెంకటేష్, గుమ్మడి కుమార్, అక్కెం రాఘవేందర్ యాదవ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

**వివాహ వేడుకలో పాల్గొన్న ఆత్మీయ జర్నలిస్టులు :**

డాక్టర్ సాయి చరణ్ రెడ్డి, డాక్టర్ కీర్తన రెడ్డి ల రిసెప్షన్ వేడుక లలో జర్నలిస్టు సంఘం రాష్ట్ర నాయకులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, మహ్మద్ సలీం, మ్యాడమ్ మధుసూదన్, మురళీధర్ అమర్ నాథ్, అప్పారెడ్డి గూడెం భీమయ్య, ఏపీ చారి, మెక్కొండ ప్రేమ్ రాజ్, పి సూర్య నారాయణ, బుడిగెల బాబు రావు, వర్కాల చందు, గద్దె యాదగిరి, కోరని మహేష్, ఎం బాలసుబ్రమణ్యం, యూ శ్రీకాంత్, లక్ష్మణ్, పి వెంకటేష్, మాసయ్య, గోంగూర శ్రీనివాస్, కరుణాకర్, కోట శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

రిసెప్షన్ వేడుక కు హాజరైన తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు అబ్దేశీ సదాలక్ష్మి తో అప్పారెడ్డిగూడెం మాధవి





రిసెప్షన్ వేడుకలో జర్నలిస్టుల కుటుంబ సభ్యులు



పెళ్లి కుమారుడు డాక్టర్ మేకల సాయి చరణ్ రెడ్డి మాతృ మూర్తి మేకల వనితా రెడ్డితో ఆత్మీయ సహోదరీలు



రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ టి ప్రేమదాస్ గౌడ్

# లక్ష్మీగూడ రాజీవ్ గృహకల్ప వాసులకు అపర భగీరథునిగా నిలిచిన పి కార్తీక్ రెడ్డి

**బుద్వేల్, జూన్ 28(నమస్తే ఉదయం)**

అత్తాపూర్ సర్కిల్ లక్ష్మీగూడ రాజీవ్ గృహ కల్ప లో నూతన బోరు వేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తాము నివాసం ఉంటున్న ప్రాంతంలో ఉన్న మూడు బోర్లు ఎండిపోయి నీటి కోసం ఇబ్బందులు పడుతున్న లక్ష్మీగూడ రాజీవ్ గృహ కల్ప నివాసులకు స్వంత ఖర్చులతో బోరు వేసి మోటారు బిగించి నీటి అవసరాలు తీర్చిన బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి ని అక్కడి ప్రజలు అపర భగీరథునిగా అభివర్ణించారు. బోరు ను ప్రారంభిం చడానికి వచ్చిన పి కార్తీక్ రెడ్డి కి స్థానిక ప్రజలు జేజేలు పలికారు. అపర భగీరథునిగా మమ్మల్ని ఆదుకున్నావని అభినందనలతో ముంచెత్తారు. రాజీవ్ గృహకల్ప లో 544 ఇండ్లు ఉండగా, సుమారు రెం దున్నర వేల మంది ప్రజలు నివాసం ఉంటారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న మూడు బోర్లు ఎం డలకు ఎండిపోయి నీరు బంద్ కావడంతో 15 రోజులుగా తాము తిరగని ప్రదేశం లేదన్నారు. అత్తాపూర్ సర్కిల్ అధికారులను సంప్రదిస్తే తాము ఇప్పుడు బోర్లు వేస్తాలేమని చెప్పారని, జలమండలి అధికారులను కలిస్తే బోరు వేయడానికి సమయం



లక్ష్మీగూడ రాజీవ్ గృహ కల్ప లో స్వంత ఖర్చులతో బోరు వేసి మోటారు బిగించి ప్రారంభించిన బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి



పి కార్తీక్ రెడ్డి

పడుతుందన్నారని స్థానిక నాయకులు గుమ్మడి కుమార్ తెలిపారు. దీంతో లక్ష్మీగూడ వాంబే కాలనీ లో రెండు రోజులకు ఒక సారి వచ్చే మంచినీటి ని పట్టుకుని కాలం గడిపామన్నారు. అవసరాలు తీర్చుకోవడానికి కూడా నీరు లేక చాలా ఇబ్బంది కలిగిందన్నారు. పురుషులైతే బహిర్భూమికి చెరువులు ఉన్న ప్రాంతాలకు వెళ్లామని, మహిళలు చాలా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి కి చెప్పగా ఆయన స్పందించి తన స్వంత ఖర్చులతో బోరు 500 ఫీట్ల లోతు వరకు బోరు వేయించి మోటారు బిగించారని తెలిపారు. అందుకోసం రూ. 2.25 లక్షలు ఖర్చు అయ్యిందన్నారు. తమ సమస్యకు వెంటనే స్పందించి పరిష్కారం చూపిన కార్తీక్ రెడ్డికి రుణపడి ఉ ంటామన్నారు. ఈ సందర్భంగా వి కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సేవలో ఉన్న తమ కుటుంబం అధికారం ఉన్నా లేకున్నా నిత్యం వారి కష్టసుఖాలలో పాలు పంచుకుంటు ందన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం మా నాన్న హోంశాఖ మాజీ మంత్రి స్వర్గీయ పి ఇంద్రారెడ్డి ని ఎంతగానో ఆదరించిందని, మా అమ్మ హోంశాఖ మాజీ మంత్రి, ప్రస్తుత మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డిని నేటికి ఆదరిస్తు అభిమానిస్తున్నారని గుర్తు చేశారు. ఈ ప్రాంత ప్రజల కోసం ముందుండి పనిచేయడానికి ఎల్లప్పుడు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి, లక్ష్మీరాజ్, బండ రాజేశ్ యాదవ్, నోముల రాము యాదవ్, అక్కెం రాఘవేందర్ యాదవ్, ఎస్ వెంకటేశ్, జయమ్మ, లక్ష్మమ్మ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి



గణేష్ నగర్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, చిత్రంలో మైలార్ దేవుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేఖ



మాణిక్యమ్మ కాలనీ లో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు అబ్దేశీ సదాలక్ష్మి



మధుబన్ కాలనీ లో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న టీడీపీ నాయకులు ఉస్కేమూరి విజయ్ కుమార్

## ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్

**బుద్వేల్, జూన్ 28 (నమస్తే ఉదయం):**

అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులందరికి పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ అన్నారు. ఆదివరం ఆయన గణేశ్ నగర్ ప్రాథమిక పాఠశాల లో మైలార్దేవుపల్లి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రేఖ తో కలసి చిన్నారులకు పోలియో చుక్కలను పంపిణీ చేశారు. ఉడంగడ్డ, రాజేంద్రనగర్, మాణిక్యమ్మ కాలనీలలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఏ సదాలక్ష్మి చిన్నారులకు పోలియో చుక్కలను పంపిణీ చేశారు. టీడీపీ నేత ఉస్కెమూరి విజయ్ కుమార్ మధుబన్ కాలనీ చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు.

**మొదటి రోజు 35,810 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశాం : డాక్టర్ రేఖ**

రాజేంద్రనగర్ మండలంలో మొదటి రోజైన ఆదివారం 35,810 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని మైలార్దేవుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రేఖ తెలిపారు. మండల పరిధిలో 86 పోలియో బూత్ లలో, రెండు మొబైల్ వాహనాలలో, ఆరాంఘర్, పీడీపీ చౌరస్తాలోని బస్ స్టాప్లలో పోలియో చుక్కలను వేయడం జరిగిందన్నారు. 37,770 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా, 35,810 మందికి వేయడం జరిగిందన్నారు. రేపు, ఎల్లుండి ఇంటింటికి తిరిగి మిగతా వారికి పోలియో చుక్కలను వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంగీత, డాక్టర్ కీర్తన, వైద్య సిబ్బంది కేశవ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కి ఎన్యూమరేషన్ ఫారాన్ని అందచేస్తున్న రాజేంద్రనగర్ తహసిల్దార్ బొమ్మ రాములు



ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

# ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లకు ఇవ్వాలి

## హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

**బుద్వేల్, జూన్ 28 (నమస్తే ఉదయం)**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగాలంటే బూత్ లెవల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను అం దజేయాలని హైదరాబాద్ పార్లమెంటు సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. ఆదివారం ఉదయం రాజేం ద్రనగర్ తహసీల్దార్, అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ బొమ్మ రాములు, సూపర్వైజర్ శంషుద్దీన్, బీఎల్ శేఖర్ లు శాస్త్రీపురం లోని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ నివాసానికి వెళ్లి ఎన్యుమరేషన్ దరఖాస్తు ఫారాన్ని అందజేశారు. అనంతరం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి తిరిగి ఏఈఆర్ రాములు కు అందజేశారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ, ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలను ఇవ్వాలన్నారు. అందుకోసం బీఎల్ఓ లు సక్రమంగా పనిచేయాలన్నారు. ఏ తప్పులు లేకుండ ఎన్యుమరేషన్ ఫారాలను నింపిన తర్వాత తిరిగి తీసుకోవాలన్నారు. అవసరమైతే ఓటర్లకు తగిన సూచనలు. సలహాలు అందజేయాలన్నారు.



హైదర్ గూడ శ్రీ అలీ పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో చేరిన మురుగు నీరు



డ్రైనేజ్ పైప్ లైన్ ను శుభ్రం చేస్తున్న జలమండలి సిబ్బంది

# హైదర్ గూడ శ్రీ అలీ పోచమ్మ దేవాలయం వద్ద మురుగునీటి సమస్య జలమండలి అధికారులకు పట్టదా?

**బుద్వేల్, జూన్ 28 (నమస్తే ఉదయం)**

హైదర్ గూడ శ్రీ అలీ పోచమ్మ దేవాలయం ఆవరణలో మురుగునీరు చేరిదుర్గంధం వెదజల్లుతుంది. దీనిపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రనగర్ జలమండలి అధికారులు, సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. శ్రీ అలీ పోచమ్మ దేవాలయం ఉన్న ప్రాంతంలో డ్రైనేజీ పొంగి దేవాయం చుట్టురా మురుగునీరు చేరుతుండటంతో దేవాలయం లోకి వెళ్లడానికి కూడా ఇబ్బందిగా ఉ ందని భక్తులు వాపోతున్నారు. వర్షాలు పడ్డప్పుడు సమస్య మరింత తీవ్రంగా ఉ ంటుందని గుర్తు చేస్తున్నారు. ఈ విషయమై రాజేంద్రనగర్ జలమండలి అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దేవాలయం పరిసరాలలో నివాసం ఉండే ప్రజలు కూడా మురుగునీరు రోడ్డుపై నిలచి ఉండటాన్ని ఖం డిస్తున్నారు. దుర్వాసన తో పాటు దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయన్నారు. స్థానికులు, చిన్నారులు అనారోగ్యాల పాలవుతున్నారని వాపోయారు. ఈ సమస్యపై రాజేంద్రనగర్ జలమండలి అధికారులు స్పం దించకపోతే హైదరూడ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. వచ్చేవి బోనాల ఉత్సవాలు అని అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని దేవాలయం ధర్మకర్త చెట్టిగారి నరేందర్ రావు, స్థానిక నాయకులు సోమారం రాజ్ కుమార్, నల్లింగ్ అజయ్, జి భాస్కర్, సాయినాథ్, సంజయ్ తదితరులు కోరారు.

# కార్మిక రాజ్య స్థాపనే లక్ష్యంగా కార్మికులు ఉద్యమించాలి

**ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం. నరసింహ**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 28 (నమస్తే ఉదయం)**



కార్మిక రాజ్య స్థాపనే లక్ష్యంగా, హక్కుల సాధన కోసం కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎం. నరసింహ పిలుపునిచ్చారు. జోగులాంబ గద్వాల జిల్లా ఏఐటీయూసీ మూడో మహాసభలు గద్వాల పట్టణం జమ్మిచేడ్ రోడ్డులోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో కామ్రేడ్ రంగన్న అధ్యక్షతన అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ మహాసభల ప్రారంభ సూచికగా ఏఐటీయూసీ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం విజయలక్ష్మి సంఘం ఎర్రజెండాను ఆవిష్కరించారు.

**కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ధ్వజం:**

సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి ఎం. నరసింహ మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేస్తూ, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ వేలాది మందిని ఉపాధికి దూరం చేస్తున్నారని విమర్శించారు. కార్మికులందరికీ కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ మరియు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

**అసంఘటిత రంగానికి అన్యాయం:**

ఏఐటీయూసీ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం విజయలక్ష్మి మాట్లాడుతూ.. దేశంలో ఆటో, అమాలీ, రిక్షా, క్యాబ్, వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం కేంద్రం ఎలాంటి ఇన్సూరెన్స్ లేదా వెల్ఫేర్ బోర్డులను ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్లు:**

రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రేమ్ పావని మాట్లాడుతూ, ఆర్టీసీ, ఆటో కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి కార్మికులకు పనిభారం పెరిగినా కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించకుండా ప్రైవేట్ ఏజెన్సీలకు శ్రమ దోపిడీకి అప్పగించడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించిన జీతాల పెంపుదలపై అన్ని రంగాల కార్మికులకు స్పష్టత ఇవ్వాలని కోరారు.

**భవిష్యత్తు కార్యాచరణ:**

జోగులాంబ గద్వాల జిల్లాలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాలను మరింత బలోపేతం చేసి, సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలని, దీనికి రాష్ట్ర కమిటీ పూర్తి సహకారం అందిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్మిక సమస్యలపై పలు కీలక తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఈ మహాసభలలో ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగన్న, వెంకటేష్, కాసిం, కృష్ణ, నారాయణ రాజు, నాగరాజు, పరశురాము, వెంకటేశు, మద్దిలేటి, నాగార్జున, ప్రవీణ్, భరత్, ఆశన్న, కురుమన్న, బంగారు తిమ్మప్ప, రవి, వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

# నాకు చావంటే భయం లేదు

**ఈ ఏడాదే బంగ్లాదేశ్‌కు వెళ్తాను :**

**మాజీ ప్రధాని షేక్ హసీనా**

**న్యూఢిల్లీ, జూన్ 28(నమస్తే ఉదయం)::**



తీవ్ర రాజకీయ సంక్షోభం ఏర్పడి తన స్వదేశాన్ని వీడి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాదే తాను బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లిపోతానని ప్రకటించారు. తమ పార్టీ అవామీ లీగ్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, అదొక శక్తి అని పేర్కొన్నారు. మైనారిటీలపై జరిగిన ఎలాంటి దాడి అయినా బంగ్లాదేశ్ స్వాతంత్ర్యంపై దాడితో సమానమని స్పష్టం చేశారు. ఓ జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో షేక్ హసీనా ఈ మేరకు వ్యాఖ్యానించారు.

అధికారం కోసం రాజకీయాలు చేయను : షేక్ హసీనా

తాను బంగ్లాకు తిరిగి వెళ్లడమనేది వ్యక్తిగత ఆశయానికి సంబంధించిన విషయం కాదన్నారు షేక్ హసీనా. అధికారం కోసం తాను రాజకీయాలు చేయలేదని చెప్పారు. బంగ్లాదేశ్ ప్రజల సంక్షేమం కోసమే రాజకీయాలు చేస్తానని స్పష్టం చేశారు. చట్ట, రాజ్యాంగ విరుద్ధమైన, రాజకీయ ప్రేరేపిత ప్రక్రియలో భాగంగా తనపై న్యాయవ్యవస్థను రాజకీయ ప్రతీకార సాధనంగా వాడుకున్నారని ఆరోపించారు. ఇలాంటి ప్రయత్నాలు గతంలోనూ జరిగాయని అప్పుడు అవి విఫలమయ్యాయని అన్నారు. ఇప్పుడు కూడా విఫలమవుతాయని వెల్లడించారు.

"నేను చావుకు భయపడను. 1975లో నేను నా తల్లిదండ్రులు, సోదరులు సహా నా యావత్ కుటుంబాన్ని కోల్పోయాను. ప్రజల ఓట్లతో ఐదుసార్లు బంగ్లా ప్రధాని అయ్యాను. దేశాభివృద్ధికి కృషి చేశాను. నా జీవితం దాదాపుగా బంగ్లా ప్రజలు, అవామీ లీగ్, ప్రజాస్వామ్య పోరాటం, దేశాభివృద్ధికి అంకితమైంది. అందుకే నేను స్పష్టంగా చెప్పదలచుకున్నాను. ప్రతి అడ్డంకిని, ప్రతి కుట్రను అధిగమించి ఈ ఏడాదే బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్తాను. అవామీ లీగ్ అనేది కేవలం కాగితాలకే పరిమితమైన సంస్థ కాదు. తన 77 ఏళ్ల ప్రస్థానంలో అనేక సార్లు దాడులకు గురైంది. రక్తపాతాన్ని ఎదుర్కొంది. నిషేధానికి కూడా గురైంది. కానీ ప్రతిసారీ ప్రజల శక్తితో అది తిరిగి పుంజుకుంది. మేం అధికారంలో ఉన్నప్పుడు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి అవిశ్రాంతంగా కృషి చేశాం. బంగ్లాదేశ్ వ్యతిరేక శక్తులు ప్రజల్లోని ఒక వర్గాన్ని తప్పుదోవ పట్టించి కుట్రపూరితమైన, పకడ్బందీగా రూపొందించిన ఉద్యమం ద్వారా అవామీ లీగ్‌ను అధికారానికి దూరం చేశాయి. వారు ఎన్ని చేసినా ప్రజల హృదయాల నుంచి అవామీ లీగ్‌ను చెరిపివేయలేకపోయారు."

షేక్ హసీనా, బంగ్లాదేశ్ మాజీ ప్రధాని

**'బంగ్లా ఆర్థిక వ్యవస్థ బలహీనపడింది'**

బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన లేదని షేక్ హసీనా ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థ బలహీనపడిందని, మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వేధింపులను ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. అవామీ లీగ్ రాజకీయాలు ప్రతీకారం కోసం కావని హక్కులు, భద్రత, గౌరవం, అభివృద్ధికి సంబంధించినన్నారు. అవామీ లీగ్ రాజకీయ పునరుజ్జీవనం ఏ ప్రభుత్వం దయపైనో ఆధారపడి లేదన్నారు. అది ప్రజలపై ఆధారపడి ఉందని చెప్పారు. అవామీ లీగ్ సంస్థాగత బలానికి ప్రస్తుత బంగ్లా సర్కార్ భయపడుతోందని అన్నారు. అందుకే అవామీ లీగ్ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాలను అడ్డుకోవడానికి ప్రభుత్వం సైన్యం, బీజీబీ (బోర్డర్ గార్డ్స్ బంగ్లాదేశ్), పోలీసులను రంగంలోకి దించిందని గుర్తు చేశారు. ఇది ప్రభుత్వ బలహీనతకు నిదర్శనమని ఆరోపించారు. బలప్రయోగంతో అవామీ లీగ్‌ను అణచివేయలేరని పేర్కొన్నారు.

**రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి : షేక్ హసీనా**

"బంగ్లాదేశ్‌లో సరైన ప్రజాస్వామ్య వాతావరణం, స్థిరత్వం నెలకొనాలంటే అవామీ లీగ్‌పై ఉన్న అక్రమ నిషేధాన్ని ఎత్తివేయాలి. తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలి. రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి. శాంతియుత రాజకీయ కార్యకలాపాలను అనుమతించాలి. కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న సర్కార్ ప్రజాస్వామ్యాన్ని అడ్డుకుంటూనే ఉంది. ప్రజల్లో పేరుకుపోతున్న ఆగ్రహం, బాధ, ప్రజాస్వామ్య ఆకాంక్షలు అవామీ లీగ్‌కు ఒక కొత్త మార్గాన్ని సృష్టిస్తాయి. సైనిక పాలన, వివక్ష, అణచివేత, మతతత్వ రాజకీయాలు, ప్రజాస్వామ్య నిరాకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం ద్వారా బంగ్లాదేశ్ ఆవిర్భవించింది. 2024 ఆగస్టు 5 తర్వాత బంగ్లా విమోచన యుద్ధ స్ఫూర్తిపై దాడి జరిగింది. స్వాతంత్ర్య సమరయోధులను చెప్పుల దండలతో అవమానించారు. దేశవ్యాప్తంగా విమోచన యుద్ధవీరుల స్మారక చిహ్నాలను ధ్వంసం చేశారు. జై బంగ్లా నినాదాన్ని ఒక నేరంగా పరిగణించారు. జాతిపిత నివాసంపై పదేపదే దాడులు జరిగాయి. మైనారిటీ వర్గాలపై దాడులు జరిగాయి. దేవాలయాలను ధ్వంసం చేశారు. సూఫీ మందిరాలు, సాంస్కృతిక సంస్థలను లక్ష్యంగా చేసుకున్నారు. తీవ్రవాదం వ్యాప్తి చెందడానికి ఆస్కారం కల్పించారు" అని షేక్ హసీనా పేర్కొన్నారు.

అవామీ లీగ్ ప్రభుత్వ హయాంలో 2023లో బంగ్లాదేశ్ 7.25 శాతం జీడీపీ వృద్ధిని నమోదు చేసిందని, తలసరి ఆదాయం 2,793 డాలర్లకు చేరుకుందని షేక్ హసీనా వెల్లడించారు. బంగ్లాదేశ్ ఏకంగా 29 స్థానాలు ఎగబాకి ప్రపంచంలోనే 35వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని గుర్తు చేశారు. విదేశీ మారక నిల్వలు 36 రెట్లు పెరిగాయని, జీడీపీలో పెట్టుబడుల వాటా 32.05 శాతానికి చేరిందన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఐదు రెట్లు పెరిగి 3.48 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని వివరించారు. పేదరికాన్ని 18.7 శాతానికి, తీవ్ర పేదరికాన్ని 5.6 శాతానికి తగ్గించామని పేర్కొన్నారు.

**మైనారిటీలపై దాడులను ఖండించిన హసీనా**

బంగ్లాదేశ్‌లో హిందువులు సహా మైనారిటీ వర్గాలపై జరిగిన దాడులను షేక్ హసీనా ఖండించారు. బంగ్లాదేశ్‌లో మతతత్వ శక్తులు అధికారాన్ని చేజిక్కించుకున్నప్పుడల్లా మైనారిటీ వర్గాలపై భయంకరమైన హింస జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మైనారిటీల ఇళ్లు, ప్రార్థనా స్థలాలు, వ్యాపారాలు, జీవితాలు, గౌరవం అన్నీ ప్రమాదంలో పడ్డాయని అన్నారు. మైనారిటీ హక్కుల కోసం మాట్లాడిన చిన్మోయ్ కృష్ణదాస్ ఒక తప్పుడు కేసులో ఇప్పటికీ జైలులోనే మగ్గిపోతున్నారని విస్మయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినప్పటికీ బంగ్లాదేశ్‌లో మైనారిటీల తలరాత మారలేదని ఇదే రుజువు చేస్తోందన్నారు. "నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. మైనారిటీలు కేవలం ఓటు బ్యాంకు మాత్రమే కాదు. వారు సమాన గౌరవం కలిగిన బంగ్లాదేశ్ పౌరులు. 1971 నాటి గొప్ప విముక్తి పోరాటంలో హిందువులు, ముస్లింలు, బౌద్ధులు, క్రైస్తవులు, అన్ని వర్గాల ప్రజలు కులమతాలకు అతీతంగా నిలిచారు. దేశ స్వాతంత్ర్యం కోసం భుజం భుజం కలిపి పోరాడారు. అన్ని మతాల ప్రజలు సమాన హక్కులతో జీవించే ఒక లౌకిక (మతపరమైన వివక్ష లేని) బంగ్లాదేశ్ గురించి బంగాబంధు కలలు కన్నారు. అటువంటి బంగ్లాదేశ్ మతపరమైన దాడులకు, వేర్పాటువాదానికి బందీగా మారడాన్ని అనుమతించకూడదు.

# సీలింగ్ భూముల్లో మట్టి మింగేస్తున్నారు



**రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు**

**నిత్యకృత్యంగా మారిన మట్టి తరలింపు**

**తూతూ మంత్రంగా అపరాధ రుసుం విధింపు**

**పటాన్ చెరు, జూన్ 28(నమస్తే ఉదయం):**

గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని సర్వే నెంబర్ 79 సీలింగ్ భూముల్లో నుండి అక్రమంగా వందల ట్రిప్పుల మట్టి తరలిపోతోంది. జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపల్ ప్రాంతంలో రాత్రిపూట అక్రమంగా వందల సంఖ్యలో లారీల ద్వారా మట్టి తరలిస్తున్నారని సమాచారం తెలిసి కూడా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా గడ్డపోతారం,ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలకు ఈ మట్టి తరలింపు యధేచ్ఛగా జరుగుతోంది. రాత్రిపూట మట్టి తరలింపు వెనుక అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇంత జరుగుతున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారుల తీరుపై వారు మండిపడుతున్నారు. కేవలం నామమాత్రంగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఓ వైపు కొన్ని లక్షల రూపాయల మట్టి మాయం అవుతుంటే అధికారులు మొక్కుబడిగా వేలల్లో అపరాధ రుసుం విధించడం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇటీవల బొల్లారం పోలీసులు రాత్రి పూట మట్టి తరలిస్తున్న రెండు లారీలను అదుపులోకి తీసుకున్నారు. కాగా అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు లారీ లకు కేవలం పద్దెనిమిది వేల రూపాయల అపరాధ రుసుం విధించి రెవెన్యూ అధికారులు చేతులు దులుపుకున్నారు. మట్టి తరలిస్తున్న ముఠాతో రెవెన్యూ అధికారులు చేతులు కలపడం వల్ల మాత్రమే ఈ అక్రమ దందా కొనసాగుతోందని, ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ మట్టి తరలింపుకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





## విజయవంతంగా పల్స్ పోలియో

**పటాన్ చెరు, జూన్ 28( నమస్తే ఉదయం):**

చిన్నారులు పోలియో బారిన పడకుండా చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా పూర్తి అయ్యింది. బొల్లారం డివిజన్ పరిధిలోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మహేష్ కుమార్ నేతృత్వంలోని వైద్య బృందం చిన్నారులకు పోలియో చుక్కలు వేసారు. సుమారు యాభై మంది వైద్య సిబ్బంది ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అందరికీ వైద్యాధికారి డాక్టర్ మహేష్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.






## చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 28(నమస్తే ఉదయం):**

ఐదేండ్లలోపు చిన్నారులకు తప్పకుండా రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ వేయించాలని నర్సన్ దొడ్డి గ్రామ సర్పంచ్ పర్ణిక కృపాకర్ రెడ్డి సూచించారు. జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ధరూర్ మండలం నర్సన్ దొడ్డి గ్రామంలో గ్రామ సర్పంచ్ పర్ణిక కృపాకర్ రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు, చుట్టుపక్కల ఉన్న చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శిరీష, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




## నిండు జీవితానికి రెండు
# పోలియో చుక్కలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 28(నమస్తే ఉదయం):**

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతో మేలని కొండాపురం గ్రామ సర్పంచ్ పవన్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం కేటిదొడ్డి మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో పోలియో చుక్కల కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయడం ద్వారా పోలియో వ్యాధిని శాశ్వతంగా నివారించొచ్చనని తెలిపారు. అంగవైకల్యాన్ని పూర్తిగా నివారించి,చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపుదామని ఆయన పిలుపునిచ్చారు. ఇవాళ,రేపు ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయిస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733